క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామానికి చెందిన టి.వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్స చేయించుకొని, వైద్యుల పర్యవేక్షణలో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న గుండాలపాడు వలంటీర్ కె.శ్రీదేవి నరసరావుపేట వైద్యశాలకు వెళ్లి వెంకటేశ్వర్లుకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఎంఈఓలకు సన్మానం



మేడికొండూరు: మేడికొండూరు మండలం ఎస్టీయూ ఆధ్వర్యంలో నూతనంగా మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన జె.ఏసురత్నం, షేక్ అబ్దుల్ అలీమ్‌లను సన్మానించారు. కార్యక్రమం మండల విద్యా శాఖ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఎంఈఓలను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ సంఘ సభ్యులు జోజప్ప మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సభ్యులు శివరామయ్య, సుబ్బారావు, బి.శ్రీను, మల్లేశ్వరరావు, కొండలరావు, లింగయ్య, అజీజ్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి విద్యాశాఖ కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఎంఈఓ 1, ఎంఈఓ 2లను ఎస్టీయూ నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. బాపట్ల జిల్లా బాపట్లలో గరల్స్ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేసిన శాంతకుమారి తాడేపల్లి ఎంఈఓ –1గా నియమితులయ్యారు. అలాగే ఎంఈఓ –2గా నాగేశ్వరరావు నియమితులు కావడంతో వారిద్దరిని ఎస్టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోజప్ప, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి రామారావు, మండల శాఖ అధ్యక్షుడు బి.సురేష్‌బాబు, మండల గౌరవ అధ్యక్షుడు ఎస్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు రూ. 4 లక్షల విలువైన బంగారు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు మంగళగిరికి చెందిన భక్తులు సోమవారం రూ. 4 లక్షల విలువైన బంగారపు హారాన్ని కానుకగా సమర్పించారు. మంగళగిరికి చెందిన భోగి సన్యాసిరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ. 4 లక్షల విలువైన 65 గ్రాముల బంగారంతో తయారు చేయించిన ఫ్యాన్సీ హారాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబుకు అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో కాళహస్తి దేవస్థానం చైర్మన్ ఏ. శ్రీనివాసులు, ఈవో కేవీ సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

దుగ్గిరాలకు చేరిన 108 వాహనం



తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 108 వాహనం సోమవారం దుగ్గిరాల మండల కేంద్రానికి చేరింది. కొత్తగా వచ్చిన 108 వాహనానికి ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలానికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నూతన 108వాహనం అందించారన్నారు. ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ గరికపూడి ఆనంద్, విజయ్, పైలెట్లు పి. శ్రీనివాసరావు, ప్రసాదరాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- తుళ్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధులకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: సామాన్యుడికి ప్రభుత్వ సేవలు చేరువ చేసేందుకే అధికారులు, ప్రజా ప్రతినిధులతో సహా అందరూ గడపగడపకు తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తుళ్లూరు సచివాలయం–1లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకొని సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ప్రజలకు మేనిఫెస్టో సాక్షిగా ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎం ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిన సీఎం వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తూ కూడా తన పాలనలో సాంకేతిక కారణాలతో అర్హులుంటే నష్టపోకూడదనే ఏకైక ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికీ సేవలందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో అబద్ధపు ప్రచారాలు చేస్తూ ఎన్నికల్లో ఓట్లు లబ్ధిపొందేందుకు తిరుగుతున్న చంద్రబాబు ఆయన సుపుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లకు ఈ రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరికైనా సంక్షేమం అందలేదని చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఏ గడపకు వెళ్లినా ప్రజాదరణ మెండుగా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, మండల జేసీఎస్ కన్వీనర్ బండి ప్రసాద్ వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, శృంగారపాటి సందీప్, నేలపాటి నాగేంద్ర, మేకల రాంబాబు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీను పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నగరంలోని లిటిల్ విలేజీ హోటల్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడిగా అందే రేవంత్, కార్యదర్శిగా గాజుల శ్రీనివాసరావు, కోశాధికారిగా నూతలపాటి వెంకటేశ్వరరావులతో పాటు మరో 16 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రోటరీ జిల్లా 3150 గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర రెడ్డి మాట్లాడుతూ గత ఏడాదిలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి గోదావరి వరద బాధితులకు తక్షణం స్పందించి విస్తృత సాయం చేయడం, భారీ సంఖ్యలో తోపుడు బండ్లను వితరణ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. నూతన కార్యవర్గం కూడా సమాజ హితం కోసం మరింత విస్తృతంగా పనిచేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు అందే రేవంత్ మాట్లాడుతూ ఈ సంవత్సరం గ్లోబల్ గ్రాంట్లు, సీఎస్ఆర్ నిధుల సహాయంతో మంగళగిరి ప్రాంత ప్రజల అవసరాలు తీర్చడం కోసం మరింత మెరుగైన సర్వీస్ ప్రాజెక్టులను చేపట్టాలని నూతన కార్యవర్గం సంకల్పించినట్లు తెలిపారు. నూతనంగా క్లబ్ సభ్యత్వం స్వీకరించిన వారిచే అసిస్టెంట్ గవర్నర్ వై.వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, పూర్వపు అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ, సతీష్‌బాబు, డైరెక్టర్లు లంకా శివరామ్ ప్రసాద్, పారేపల్లి నిరంజన్ గుప్తా, కాపరౌతు సుందరయ్య, అందే మురళీ మోహన్‌రావు, వీసం ప్రసాద్, శ్రీభాష్యం రంగనాథ్, జొన్నాదుల భిక్షారావు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి

తాడేపల్లిరూరల్: ప్రతినెల తప్పనిసరిగా పేదల ప్రజలకు రేషన్ అందజేయాలని సీపీఎం తాడేపల్లి శాఖ కార్యదర్శి దొంతిరెడ్డి విజయభాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని 4,5 వార్డు సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అమరారెడ్డి నగర్, యానాదుల కాలనీ, కొత్త కాలనీలలో జూన్ నెల రేషన్ బియ్యం ఇవ్వలేదని అన్నారు. వినతి పత్రం అందజేసిన వెంటనే స్పందించి, అధికారుల దృష్టికి తీసుకువెళతామని సచివాలయ అడ్మిన్ హామీ ఇచ్చారని తెలిపారు. సీపీఎం నాయకులు భీమవరపు దశరధరామిరెడ్డి, సోలా ముత్యాలరావు, లంకా యలమందాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులను క్షుణ్ణంగా పరిశీలించాలి

తాడేపల్లిరూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను తయారు చేసే విధంగా పనిచేయాలని మంగళగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లలిత అన్నారు. సోమవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని 18 గ్రామాలకు సంబంధించిన బీఎల్ఓలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లలిత మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల కమిషన్ 2024కు సంబంధించి తుదిజాబితాను విడుదల చేయనున్నదని, ఈలోపు ప్రతి బూత్‌లోను పనిచేస్తున్న బీఎల్ఓలు వారి పరిధిలో వున్న ఓటర్‌లిస్టులలో డబుల్ ఎంట్రీలు తొలగించడం, మృతిచెందిన వారి వివరాలు తీసివేయడం, సంబంధిత ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళితే అక్కడ ఓటు నమోదు చేయడం, దానితో పాటు కొత్త ఓట్లను నమోదు చేసే ప్రక్రియను ప్రతి ఒక్కరు చేపట్టాలన్నారు. దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎ.ఎస్.ఓ సూర్యనారాయణ, మండల ఇన్‌స్పెక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ గడ్డిబొమ్మ దహనం



మంగళగిరిలో నారా లోకేష్ గడ్డిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మంగళగిరి: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇటీవల తాను చేనేతలను దత్తత తీసుకుంటానంటూ ప్రకటించడం.. మరో వైపు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఆప్కో చైర్మన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి చిత్రపటంపై కోడిగుడ్లు, టమాటాలు విసరడంపై చేనేత సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలకు నిరసనగా ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గంజి చిరంజీవి యువసేన సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నారా లోకేష్ గడ్డిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ చేనేతల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి చిచ్చుపెట్టే విషపూరిత రాజకీయాలకు లోకేష్ స్వస్తి పలకాలన్నారు. చేనేతలపై నారా లోకేష్‌ది కపటప్రేమ అని విమర్శించారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిపై టీడీపీ కార్యకర్తల ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేయించడం తగదన్నారు. ప్రశాంతంగా ఉన్న మంగళగిరిలో లోకేష్ హింసాత్మక శక్తులను ప్రేరేపిస్తున్నారని, ఇటువంటివి మానుకోకుంటే భవిష్యత్తులో లోకేష్ పాదయాత్ర అడ్డుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషిచేయాలి



నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని జేసీఎస్ కన్వీనర్లుగా నియమితులైన షేక్ ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, ఈదులమూడి డేవిడ్ రాజు, మున్నంగి వివేకానందరెడ్డి, శృంగారపాటి రత్నంలకు పార్టీ నేతలు, కార్యకర్తలు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణకుమారి, ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ నిధులతో అభివృద్ధి పనులు

- మైనింగ్ శాఖ నుంచి దుగ్గిరాల మండలానికి రూ.4 కోట్లు విడుదల
- నిధుల విడుదలలో ఎమ్మెల్యే ఆర్కే చొరవ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 2014 – 19 సంవత్సరాలకు గాను జరిగిన మైనింగ్ తవ్వకాలకు సంబంధించి మండలానికి రావలసిన నిధులు రూ.4కోట్లు మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో విడుదలయ్యాయి. ఆ నిధులతో మండలంలోని 18 గ్రామాల్లో అభివృద్ధి పనులను మండల ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రారంభించారు. దుగ్గిరాల మండల పరిధిలో రూ.40 లక్షల వ్యయంతో 575.50 మీటర్ల పొడవున సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. దుగ్గిరాల గ్రామ పరిధిలో నాగళ్ల కృష్ణప్రసాద్ ఇంటి వద్ద నుంచి ఎయిర్‌టెల్ టవర్ వరకు 130.50 మీటర్లు, షేక్ బాజి నివాసం నుంచి ఎస్‌కే సంధాని ఇంటి వరకు 70 మీటర్లు, షేక్ వహీద్ ఇంటి నుంచి పటాన్ జున్ను ఖాన్ నివాసం వరకు 28.20 మీటర్లు, ఎండీ రఫీవుల్లా నివాసం నుంచి పటాన్ సుభాని నివాసం వరకు 121.50 మీటర్లు, కడప దర్గా రోడ్ (ఆలీ నగర్) 25.30 మీటర్లు, గంటా జెర్రి థామస్ నివాసం నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు 200 మీటర్లు మొత్తం 575.50, మిగిలిన రూ.3కోట్ల 60 లక్షలకు సంబంధించి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో వున్న రహదారులు, డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు మండల ఏఈ రమేష్‌రెడ్డి తెలియజేశారు. సీఎండీఎఫ్ నిధుల నుంచి రూ.15లక్షలు కేటాయించగా దుగ్గిరాల గ్రామంలో నిమ్మగడ్డ కోటేశ్వరరావు నివాసం నుంచి తాడిబోయిన నాగరాజు నివాసం వరకు 76.50 మీటర్ల మేర రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం, రూ.10 లక్షల వ్యయంతో మోరంపూడి గ్రామంలో కూచిపూడి చిన్న ఇశ్రాయేలు నివాసం నుంచి కూచిపూడి దయాకర్ నివాసం వరకు 72 మీటర్లు, కూచిపూడి సురేష్ నివాసం నుంచి అమృతలూరి అరవింద నివాసం వరకు 71.30 మీటర్ల మేర సీసీ రోడ్ నిర్మాణం చేపట్టినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఏఈ రమేష్‌రెడ్డి తెలిపారు.

పేదింటి విద్యకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

తాడికొండ గురుకుల పాఠశాలలో అమ్మఒడి చెక్కు పంపిణీ చేసిన కత్తెర సురేష్ కుమార్



విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి మెగా చెక్కు అందజేస్తున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకొని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తాడికొండలోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన అమ్మ ఒడి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి పేదవాడి ఆర్థిక, సామాజిక ఎదుగుదల విద్య ద్వారానే సాధ్యమని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో పేదలు చదువుకునేందుకు పడుతున్న కష్టాలను అతి దగ్గరగా చూసి అమ్మ ఒడితో పాటు పలు పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న బాబు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి ప్రైవేటుకు పెద్దపీట వేసి కార్పొరేట్‌లకు కొమ్ముకాసినందునే నాడు పేదలు చదువును కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్తున్న సౌకర్యాలు చూసి నో అడ్మిషన్ బోర్డులు పెట్టే స్థాయికి వచ్చిందంటే అది పేదవాడి చదువుకు జగనన్న ఇస్తున్న ప్రాముఖ్యతకు నిదర్శనమన్నారు. గురుకులంలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనను సంప్రదిస్తే సత్వర పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాడికొండ, నిడుముక్కల సర్పంచ్‌లు తోకల సరోజిని, మాదాసు రత్నకుమారిలతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఎంఈఓ తెనాలి ఇందిర, ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు, ఏపీఎం సాంబశివరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాప్తిజం ఘాట్ నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు

- అభ్యంతరాలు ఉంటే అధికారులను సంప్రదించాలి
- అల్ప సంఖ్యాకులైన క్రైస్తవుల హక్కులు కాల రాయొద్దు
- బీజేపీ నేతలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) హితవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగరంలో క్రైస్తవుల కోసం నిర్మించతలపెట్టిన బాప్తిజం ఘాట్ నిర్మాణ పనులను అడ్డుకుని వారి హక్కులను కాల రాయడం బీజేపీ నేతలకు తగదని, బాప్తిజం ఘాట్ నిర్మాణంపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తనను గానీ, నగరపాలక సంస్థ అధికారులను గానీ సంప్రదించవచ్చని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. సోమవారం నగరంలోని గుంటూరు చానల్ వెంబడి నిర్మించతలపెట్టిన బాప్తిజం ఘాట్ నిర్మాణ పనులను పలువురు బీజేపీ నేతలు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే బాప్తిజం ఘాట్ నిర్మాణ పనులను అడ్డుకున్న బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నాయకులు బాప్తిజం ఘాట్ నిర్మాణ పనులను అడ్డుకున్నారని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బీజేపీ నేతలకు డబ్బులిచ్చి ప్రోత్సహించారనే విషయం కూడా తనకు స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. మంగళగిరి నగరంలో అందరూ కలిసి మెలిసి జీవిస్తున్నామని, ఈ నేపథ్యంలో ఇటువంటి గందరగోళ పరిస్థితులు సృష్టించడం తగదన్నారు. మత మార్పిడి అనేది మనస్సుకు, వ్యక్తికి సంబంధించిన విషయమని, దానికి అవకాశం భారత రాజ్యాంగమే కల్పించిందనే విషయాన్ని బీజేపీ నేతలు తెలుసుకోవాలన్నారు. భారతదేశం లౌకిక రాజ్యం అని తెలిసి కూడా.. బైబిల్‌లో రాయబడినట్లుగా క్రైస్తవులు బాప్తిజం తీసుకుంటే మీకు అభ్యంతరం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఒక వేళ నిజంగా మత మార్పిడి జరుగుతుంటే మత మార్పిడిలు చేయడానికి వీలు లేదని, భారతదేశం హిందూ దేశం అని ప్రకటించి అందుకు అనుగుణంగా బీజేపీ ప్రభుత్వం చట్టం తీసుకువస్తే ఆ చట్టాన్ని అందరూ గౌరవించి పాలో అవుతారన్నారు. మత మార్పిడి వంకతో అల్ప సంఖ్యాకులుగా ఉన్న క్రైస్తవులను గానీ, ముస్లింలనుగానీ, మరే ఇతర మతస్తులనైనా హింసించి ఇబ్బందులు కలుగజేసే అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో శాసన సభ్యుడిగా ఎన్నుకోబడిన తనకు అన్ని కులాల వారు, అన్ని మతాల వారు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తుంటారని, వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఓ ప్రజాప్రతినిధిగా తనపై ఉంటుందన్నారు. గత ఏడెనిమిది నెలల క్రితం నియోజకవర్గానికి చెందిన క్రైస్తవులు తమకు నగరంలో బాప్తిజం ఘాట్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించిన నేపథ్యంలో వారి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. బాప్తిజం ఘాట్ నిర్మాణ విషయంలో రాజకీయ నేతల ముసుగులో గందరగోళం సృష్టించడం భావ్యం కాదని ఎమ్మెల్యే ఆర్కే హితవు పలికారు.

‘జగనన్న సురక్ష’ను జయప్రదం చేయాలి



నులకపేటలో గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం నులకపేటలోని పార్టీ కార్యాలయంలో తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు అధ్యక్షత గృహసారథుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికిముఖ్య అతిథిగా విచ్చేసిన తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల స్వామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో సమూలమైన మార్పులు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, పార్టీలకు, వర్గాలకు, మతాలకు, కులాలకు అతీతంగా పనిచేసి అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ప్రజల సమస్యలను గుర్తించి, వారి ఇంటి వద్దే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని, నులకపేట పరిధిలో వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడే దరఖాస్తు చేయించి వారికి సచివాలయం ఆధ్వర్యంలో టోకెన్ నెంబర్ అందించి జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని పరిష్కరించాలని ఆయన అన్నారు. అనంతరం తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్‌గా ఎన్నికైన ఈదులమూడి డేవిడ్‌రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కుంచాల శ్రీను, అనుపర్తి పద్మ, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై ఇంటింటి ప్రచారం

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివర్గాలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంపై సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 6వ సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్ లక్ష్మీరోజ ఆధ్వర్యంలో సి–4, సి–6 క్లస్టర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ 6వ సచివాలయం పరిధిలో ప్రతి నివాసంలో లబ్ధిదారులు ఎవరైనా ఉన్నారేమో గుర్తించి, ఇతర ధ్రువీకరణ పత్రాలు అవసరమా అనే విషయాన్ని తెలుసుకుని సచివాలయ పరిధిలో ఉన్న వలంటీర్ల చేత దరఖాస్తులు రాయించి వారికి అందజేస్తున్నారు. 11 రకాలకు సంబంధించిన సేవలను జగనన్న సురక్షలో పరిష్కారం అవుతాయని ప్రజలకు వివరిస్తున్నట్లు లక్ష్మీ రోజా తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు కుమారి, ఎం.సురేష్, ఉప్పు శ్రీనివాసరావు, అనుముక్కల అంబారావు, టి.రోజ, తాంద్ర కిషోర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో నూతక్కికి చెందిన పెద వడ్లపూడి పంచాయతీ మాజీ కార్యదర్శి రాఘవరపు శివ ప్రసాద్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాపు సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. రాఘవరపు రజనీ కుమారి, ప్రశాంత్, నాగలక్ష్మి, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



విశేష అలంకారంలో సాయినాథుడు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సాలన బస్టాండు సెంటర్‌లోని సాయినాథ ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి అర్చకుడు విశ్వనాథశాస్త్రి పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష అర్చనలు చేశారు. పలురకాల పుష్పాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

విజయకీలాద్రిపై గురుపౌర్ణమి మహోత్సవాలు



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సీతానగరం, విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం గురుపౌర్ణమి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు శ్రీసూక్త హవనం, లక్ష్మీ హయగ్రీవ హవనం, 10 గంటలకు శ్రీ సీతారామచంద్రుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను వీక్షించి అన్న ప్రసాదాలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.

ఆగస్టు 15 నాటికి డంపింగ్ యార్డు స్థలంలో పార్కు నిర్మాణం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు రోడ్ రైల్వేగేటు వద్ద గల డంపింగ్‌యార్డు స్థలాన్ని ఆగస్టు 15 నాటికి పార్కుగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సోమవారం ఆయన నగర పాలక సంస్థ అధికారులతో కలసి డంపింగ్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ డంపింగ్ యార్డు తరలింపు పనులను ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు దాదాపూ పూర్తి చేశారని, అయితే ఆగస్టు 15వ తేదీ నాటికి పార్కు నిర్మాణం పూర్తి చేసే విధంగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.